క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నంది హిల్స్, శ్రీరామ కాలనీ, దీన్‌దయాళ్‌నగర్, న్యూ బస్టాండ్, పద్మాక్షి దేవాలయం, పింజర్ల, ఏనుగుల గడ్డ, కాజీపేట ప్రశాంత్‌నగర్, చైతన్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు, సోమిడి, తిలక్‌నగర్, సెయింట్ ఆన్స్ స్కూల్, విద్యానగర్ కాలనీ, హనుమకొండలోని బొక్కలగడ్డ, శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మడికొండలోని టెక్ మహీంద్ర ఐటీ కంపెనీ ప్రాంతంలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



కాశిబుగ్గ : అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 74వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ గ్రేటర్ వరంగల్ నాయకుడు అఖిల్ పిలుపునిచ్చారు. మంగళవారం కాశిబుగ్గ జంక్షన్‌లో వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్‌బీ 1951లో ఏర్పడి కుల,మత ప్రాంతాలకతీతంగా సోషలిజం సాధనకై నేతాజీ కలలు కన్నా భారతదేశపు పునర్నిర్మాణ కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు మోహన్, కుల్దీప్, రాజు, రణదీర్, విష్ణు, రవితేజ, సాయివర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు మృతి


సంజీవరెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి: తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు కోట సంజీవరెడ్డి (87) అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని నాగారానికి చెందిన సంజీవరెడ్డి ప్రస్తుతం హన్మకొండలో నివాసం ఉంటున్నాడు. 1969లో జరిగిన తెలంగా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. సంజీవ రెడ్డి మృతిపై స్నేహితులు, బంధువులు, తెలంగాణ ఉద్యమకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నేడు లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

హన్మకొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు గుండ్ల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు అయినవోలు మండలం ఉడుతగూడెంలోని మ్యాంగో రిసార్ట్‌లో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా గుండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అల్లాడి సతీష్, ప్రధాన కార్యదర్శిగా లెక్కల మాధవ రెడ్డి, కోశాధికారి గారె నర్సయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ వెంకటేశ్వరరావు, గవర్నర్ ఎలెక్ట్ కె.వెంకటరెడ్డి, ఇన్సులేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆర్య పాల్గొంటారని వివరించారు. లయన్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ గ్రామశివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన అంబటి ప్రవీణ్ ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జనతా గ్యారేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుభాకర్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.8వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో రాజేందర్, ఉదయ్, రాజు, సూరి, యాదగిరి, సభ్యులు ఉన్నారు.

ఐటీఐల్లో దరఖాస్తుల గడువు పొడిగింపు

కాజీపేట : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 14 వరకు పొడిగించినట్లు కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ కె.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు. సాంకేతిక విద్యను అభ్యసించాలనే అభిలాష ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈఆర్ఓలో బిల్ కౌంటర్ ఎత్తివేత

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- యాజమాన్యానికి సమాచారం ఇవ్వకుండానే తొలగింపు
- గ్రామాల నుంచి వచ్చి తిరిగి వెళ్తున్న వినియోగదారులు


ఖాళీగా ఉన్న బిల్లింగ్ కౌంటర్



హనుమకొండ రూరల్ విద్యుత్ రెవెన్యూ ఆఫీస్

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బిల్‌కౌంటర్‌ను గుట్టుచప్పుడు కాకుండా ఎత్తివేసి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వినియోగదారులు తమ బిల్లులు చెల్లించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రతి విద్యుత్ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్‌ఓ)లో బిల్ కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. హనుమకొండ రూరల్ డివిజన్‌కు చెందిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని బాలసముద్రంలోని సబ్‌స్టేషన్ స్థలంలో ఏర్పాటు చేశారు. ఇదే ఈఆర్‌ఓలో హనుమకొండ రూరల్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం బిల్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్న బిల్‌కౌంటర్‌ను యాజమాన్యానికి కనీస సమాచారం ఇవ్వకుండానే డివిజనల్ అధికారి ఎత్తివేశారు. బిల్లులకు సంబంధించి, ఇతర సమస్యలు, హెచ్చుతగ్గులు, సందేహాలుంటే డివిజన్‌లోని ఆయా గ్రామాల ప్రజలు ఈఆర్‌ఓ కార్యాలయానికి వచ్చి అధికారుల దృష్టికి వారి సమస్యలు, సందేహాలు వివరించి వాటిని నివృత్తి చేసుకుని బిల్లులు చెల్లించేవారు. బిల్‌కౌంటర్ ఎత్తి వేయడంతో ఎక్కడ బిల్లు చెల్లించాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా హనుమకొండ రూరల్ ఈఆర్‌ఓలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులను ఎన్నికలకోడ్ అమలులో ఉండగా ఏప్రిల్‌లో హనుమకొండ రూరల్ డివిజన్ (ఆపరేషన్) కార్యాలయానికి నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ వేశారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో డిప్యుటేషన్లపై నిషేధం ఉన్నా అవేమి తమకు పట్టవన్నట్లుగా డిప్యుటేషన్ వేసిన డివిజనల్ అధికారి నాలుగురోజుల తర్వాత పాత తేదీతోనే డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఘనత ఆయనకే చెల్లింది. తర్వాత వర్క్ ఆర్డర్ పేరుతో వారిని హనుమకొండ రూరల్ డివిజన్ కార్యాలయంలోనే పని చేయించుకుంటున్నారు. దీంతో ఈఆర్‌ఓ కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఏర్పడింది. బిల్ కౌంటర్‌లో పని చేసే వారు కరువయ్యారు. హనుమకొండ జిల్లాలో ఆ డివిజనల్ అధికారి వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. విద్యుత్ సంస్థకు ఆదాయాన్ని సమకూర్చే ఈఆర్‌ఓలను నిర్వీర్యం చేస్తున్నాడని, ఇదే డివిజన్ పరిధిలోని పరకాల ఈఆర్‌ఓ నుంచి ఒక ఉద్యోగిని, హనుమకొండ రూరల్ ఈఆర్‌ఓ నుంచి ఇద్దరు ఉద్యోగులను వర్క్ ఆర్డర్ పేరుతో ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో పని చేయించుకుంటున్నారని, దీంతో ఈఆర్‌ఓలో ఉద్యోగులు లేక ఉన్న వారిపై భారం పడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈఆర్‌ఓలు నిర్వీర్యమైతే విద్యుత్ బిల్లుల వసూళ్లు కాక బకాయిలు పేరుకుపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేయాలని, ఈఆర్‌ఓలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి


కాశిబుగ్గ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కాశిబుగ్గ : వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాఖాద్రీ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 నీట్ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు పొందారని ఇంతమందికి ఒకేలా మార్కులు ఎలా వచ్చాయనే దానిపై వివాదం నెలకొందన్నా రు. హర్యానాలోని ఓ పరీక్ష కేంద్రంలో పక్కపక్కనే కూర్చున్న 8 మందికి 720కి 720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ మా ర్కుల ఆధారంగా వైద్య కళాశాల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుధీర్, గణేష్, సారయ్య, సుమన్, అమీర్ పాల్గొన్నారు.

రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆరెల్లి కృష్ణ

ఖిలా వరంగల్: ఈనెల 23న భద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఇల్లందులో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్‌లోని గోదాముల వద్ద రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం గతంలో చేసిన కార్మికుల వ్యతిరేకంగా చట్టాలు, రైతాంగానికి వ్యతిరేకంగా చేసిన చ ట్టాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్ర ధా నకార్యదర్శి నున్న అప్పారావు, రాజయ్య, ల్యాదెల్ల ఎల్లయ్య, చిన్నస్వామి, లక్ష్మీ, వెంకటేష్, రాజు, ఏలియా, అమరేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్లకు టీజీఏఓ అభినందనలు


కాళోజీసెంటర్: వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీఏఓ నాయకులు

హన్మకొండ అర్బన్/కాళోజీ సెంటర్ : వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసినందుకు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తాపట్నాయక్, పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లా అధికారులతో పాటు గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులందరి పూర్తి సహాయ సహకారాలతోనే జిల్లాలో ఎన్నికలు దిగ్విజయంగా పూర్తి చేయగలిగామన్నారు. ఈ సందర్భంగా వారందరికీ కలెక్టర్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్, అన్వర్ హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మాధవరెడ్డి, రాజేష్‌కుమార్, నారాయణ, డీసీఓ సంజీవరెడ్డి, సీఈఓ రామిరెడ్డి, టీజీఓ ప్రధాన కార్యదర్శి ఫణికుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్, చంద్ర శేఖర్, మాధవ రెడ్డి, రాజేష్‌కుమార్‌నాగనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు మహర్దశ

- అభివృద్ధికి రూ.22.19 లక్షలు మంజూరు

కాళోజీ సెంటర్: జిల్లాలోని గ్రంథాలయాలకు మహర్దశ పట్టనుంది. కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రత్యేక చొరవ చూపి మండల కేంద్రాల్లో గ్రంథాలయాలను గుర్తించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం సుమారు రూ.22.19 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో వరంగల్ కేంద్రీయ గ్రంథాలయం, పర్వతగిరి, కరీమాబాద్, రంగశాయిపేట, ఉర్సు, నర్సంపేట, ఖానాపూరం, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి, గురిజాల తదితర గ్రంథాలయాల భవనాలను మరమ్మతు చేయనున్నారు. పెయింటింగ్ వేసి తలుపులు, కిటికీలు, బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థుల కోసం గ్రంథాలయాలను తీర్చిదిద్దుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. పోటీ పరీక్షలకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయి. విద్యార్థులు సమయం వృథా చేయకుండా గ్రంథాలయాలకు వెళ్లాలి. బాగా చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలి.

– పి.ప్రావీణ్య, కలెక్టర్

ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుదాం


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నయీంనగర్: ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పర్యావరణ ఎన్‌జీఓస్ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు డాక్టర్ బి.కుమారస్వామి అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ పర్యావరణ ఎన్‌జీఓస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 27వ డివిజన్ వరంగల్ కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఉదయం 8 గంటలకు ఉచిత గుడ్డ సంచుల పంపిణీ, పర్యావరణంపై అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు మానవులకు హానికరం, క్యాన్సర్ వ్యాధికి కారకమన్నారు. వరంగల్ నగరంలో రోజుకు 300 టన్నుల వ్యర్థాలు సేకరిస్తుండగా అందులో 70 టన్నుల ప్లాస్టిక్ ఉంటుందన్నారు. నాలాలు, కాలువల్లో ప్లాస్టిక్ నిండిపోయి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల సుధాకర్, శివప్రసాద్, సుదర్శన్ గౌడ్, రతన్‌సింగ్ ఠాకూర్, గైని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పర్వదినానికి ముమ్మర ఏర్పాట్లు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద ఈద్గా మైదానంలో ఈనెల 17న జరగనున్న బక్రీద్ పర్వదిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయాన్నే బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య ఆధ్వర్యంలో ముస్లీం, మైనార్టీ నేత ఎంఏ జబ్బార్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు ఈద్గా మైదానాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేయనున్నదని తెలిపారు. ఉదయాన్నే మంత్రి సురేఖ హాజరై ముస్లీం మతపెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ. చాంద్ పాషా, ఎండీ.అమ్జద్, హసన్ అలీ, ముగ్దుం, ఆశ్రఫ్, మాషూక్, జాకీర్, సలీం, షర్ఫొద్దీన్ పాల్గొన్నారు

ఈద్గాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు


కాజీపేట: ఈద్గాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ

కాజీపేట : కాజీపేట పట్టణ శివారులో ఉన్న ఈద్గా మైదానం అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ప్రారంభించారు. బక్రీదు సందర్భంగా ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేయనున్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్లు పాల్గొన్నారు.

భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

హన్మకొండ అర్బన్ : రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న వంట కార్మికుల పెండింగ్ మెస్ బకాయిలు, వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా పిలుపులో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా వంట కార్మికులకు నెలనెలా రూ.10 వేల పెంచి ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అది అమలు కాలేదన్నారు. అలాగే వయస్సు పైబడిన కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ల కింద రూ.5 లక్షలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పరాదన్నారు. వంట కార్మికులందరిని నాల్గో తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మల రామ్మూర్తి, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గద్దం లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని లక్ష్మీ, నాయకులు ఇల్లందుల రాములు, రమ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాములలో పోలీసు జాగృతి కళాప్రదర్శన


మాట్లాడుతున్న సీఐ రమేశ్

వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఏనుమాముల గ్రామంలో పోలీసు జాగృతి కళా బృందంచే చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, బాలకార్మికులు, సీసీ కెమెరాలు, గుట్కా, గంజాయి తదితర అంశాలపై ప్రదర్శనలు ఇచ్చినట్లు స్థానిక సీఐ పులి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌తో యువకులు వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని, నకిలీ విత్తనాలు ఎవరూ కొనవద్దని ఎవరైనా డీలర్ వద్ద కొంటే కచ్చితంగా రశీదు తీసుకోవాలని సూచించారు. పలు అంశాలపై పాటల ద్వారా సైబర్ క్రైమ్స్, నాటిక ద్వారా ప్రదర్శిస్తూ 1930 సైబర్ టోల్ నంబర్‌పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, కళాబృందం ఇన్‌చార్జ్ ఉమెన్ ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్‌రాజు, నారాయణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కాళోజీ సెంటర్: గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి మల్టీ మెంటర్ అసోసియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బీవీ నిర్మాలాగీతాంబతో కలిసి ఈ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఫొటోలు కూడా తీయాలని ఆదేశించారు. సంబంధిత దరఖాస్తులు తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లను గుర్తించి రహస్య ఆపరేషన్లు నిర్వహించి, లింగనిర్ధాణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతకు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి అవగాహన కల్పించాలని, యుక్తవయసులో వచ్చే మార్పులపై అన్ని కళాశాలల్లో అవగాహన కల్పించాలని, భ్రూణ హత్యలను నివారించి జిల్లాలో బాలికల నిష్పత్తి పెంచాలని కోరారు. సమావేశంలో డీసీపీ రవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, ప్రాజెక్టు అధికారి పద్మశ్రీ, మాస్ మీడియా అధికారి అనిల్, ఏసీపీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ



హన్మకొండ: హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతూ చదువుతున్న విద్యార్థినులకు అనురాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మంగళవారం స్వధార్ హోంలో జరిగిన కార్యక్రమంలో ది నేషనల్ కన్జ్యూమర్ కమిషన్ జాతీయ జాయింట్ సెక్రటరీ డాక్టర్ కరుకాల అనితా రెడ్డి పాల్గొని విద్యార్థినులకు లాంగ్ నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. పిల్లలు క్రమశిక్షణతో మంచి నడవడికతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టంగా చదువుకోవాలని సూచించారు. స్వధార్ హోం నిర్వాహకురాలు శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


'బెస్ట్ అవైలబుల్' అడ్మిషన్లు

కాళోజీ సెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద విద్యార్థుల ప్రవేశాలకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన డ్రా తీసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి తెలిపారు. ఒకటో తరగతికి 60 సీట్లు, 5వ తరగతికి 62 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

18 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్: ఈనెల 18, 19, 20 తేదీల్లో యాదగిరిగుట్ట యాదాద్రిలో లక్ష్మీనర్సింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంఘీ ఎలేందర్, జన్ను రవి తెలిపారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశంలో శిక్షణ తరగతుల కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. రాజేందర్, బద్రి పాల్గొన్నారు.

'మార్నేని'కి అభినందనలు



హసన్‌పర్తి: టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులైన మార్నేని రవీందర్‌రావును పీఏసీఎస్ చైర్మన్లు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కలిసిన వారిలో హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, డైరెక్టర్ మధన్, సముద్రాల మధు, డివిజన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్–ఖమ్మం రోడ్డుపై నాగమయ్య అర్చి ఎదుట మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన యువకుడు శంభునిపేట నుంచి వరంగల్ వైపు బైక్ వెళ్తుండగా రోడ్డు క్రాస్ చేస్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు బలయమైన గాయాలు కాగా 108 వాహనంలో అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

శిక్షించే వరకు పోరాటం చేస్తాం




న్యూశాయంపేట : మహిళా కార్మికులపై అసభ్యకరంగా వ్యవహరిస్తే కఠినంగా శిక్షించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎస్.రజిత హెచ్చరించారు. మంగళవారం శ్రీలత అధ్యక్షతన హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన నూతన కమిటీ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనగా హనుమకొండ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ అర్బన్ : వరంగల్ హంటర్‌రోడ్డు, పద్మాక్షి గుట్ట రోడ్డులో భద్రకాళి బండ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ బడా భవనాలను నిర్మించి, విక్రయానికి పెట్టారని నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు విన్నవించారు. మంగళవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో చక్రపాణి, సుదర్శన్, రాజు తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడికి పంపించాలి



కాజీపేట: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. 62వ డివిజన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రాథమిక హెచ్ఎం సతీష్ కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల రమ పాల్గొన్నారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు

కాజీపేట: కాజీపేట శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మల్లిఖార్జున స్వామి దేవతామూర్తులకు నూతనవస్త్రాలు అందించారు. స్వామి వారికి బంగారు కవచం తొడిగి పూలతో అభిషేకం చేశారు.

ఆన్‌లైన్‌లో పెరిగిన బిల్లుల చెల్లింపులు

హన్మకొండ: ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపులు రోజు రోజుకు పెరుగుతున్నాయని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ ఎస్ఈ మధుసూధన్ రావు తెలిపారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో వరంగల్ సర్కిల్ పరిధిలో ఆన్‌లైన్ చెల్లింపులు వృద్ధి చెందాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే నెలలో 71,367 మంది గృహ వినియోగదారులు రూ.10.97 కోట్లు ఆన్‌లైన్‌లోని వివిధ మార్గాల ద్వారా చెల్లించారని వివరించారు. ప్రతి నెల 20 శాతం పెరుగుతుందన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారని వివరించారు. ఇప్పుడు విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను కూడా పొందుపరుస్తున్నట్లు తెలిపారు. వరంగల్, మట్టెవాడ ఈఆర్‌ఓ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టామని, మొబైల్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లులు చెల్లించవచ్చని వివరించారు. మొబైల్ ద్వారా వినియోగదారులు సెల్ఫ్ మీటర్ రీడింగ్ తీసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు.

తప్పిపోయిన బాలుడు తండ్రికి అప్పగింత



కాశిబుగ్గ : తప్పిపోయిన బాలుడిని పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించిన ఘటన ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బడిగామ్‌కు చెందిన నిరంజన్ నగరంలో పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సా గిస్తున్నారు. మద్యానికి బానిసైన నిరంజన్ తన కుమారుడు నిషాద్‌ను పట్టించుకోకపోవడంతో తప్పిపోయి వరంగల్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఏడుస్తూ కనిపించాడు. గమనించిన బ్లూ కోర్టు పో లీసులు నిషాద్‌ను చేరదీసి స్టేషన్‌కు తీసుకొ చ్చా రు. సీఐ నిషాద్ తండ్రి నిరంజన్‌ను స్టేషన్‌కు పిలి పించి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించామని తెలిపారు.

మహానంది పురస్కారం

హన్మకొండ: న్యూ తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బొబ్బిలి లక్ష్మి,, ప్రెసిడెంట్ శైలేష్ కుమార్‌ను మ్యారేజ్ బ్యూరో మీడియేటర్ అసోసియేషన్ సన్మానించి మహానంది అవార్డు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మ్యారేజ్ బ్యూరో మీడియేటర్ అసోసియేషన్ సమావేశంలో విశిష్టసేవలు అందిస్తున్న లక్ష్మి, శైలేష్ కుమార్‌కు మహానంది పురస్కారానికి అందించి సత్కరించారు.